
# జోర్డాన్, ఈజిప్ట్ ట్రావెలాగ్

**– మల్లాది వెంకట కృష్ణమూర్తి**



*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**26-10-2015 సోమవారం - 9 వ రోజు**

వేకప్ కాల్ ఏడుకి. మేం నిద్రలేచేసరికి ఈ రోజు మా పడవ లక్సర్ వైపు ప్రయాణిస్తోంది. మేం తయారై ఎనిమిదికి బ్రేక్‌ఫాస్ట్ చేసాం. ఆ హాల్ అన్నిటికన్నా కింది డెక్. పీటా, ఇంకా అనేక రకాల బ్రెడ్స్, రకరకాల పచ్చి కూరగాయలు, రాజ్‌మా లాంటి బీన్స్ కూర, కాఫీ, టీ. అంత ఉదయమే ఆకలి లేక పెద్దగా తినలేదు. కిటికీల్లోంచి నది ఒడ్డున పచ్చటి మొక్కజొన్న, చెరకుపంట, ఖర్జూర చెట్లు కనిపించాయి. అది రంజాన్ ఆఖరి రోజు కాబట్టి రెస్ట్‌రెంట్ బాగా అలంకరించారు. స్థంభాలకి రంగురంగుల బట్టలని చుట్టారు. ఓడ డెక్ మీదకి వెళ్ళాం. ఎండమండిపోతోంది. విదేశస్థులు స్విమ్మింగ్, సన్ బేతింగ్ చేస్తున్నారు. కొందరు లాంజ్ ఛెయిర్స్‌లో కూర్చున్నారు.


హాట్ ఎయిర్ బెలూన్‌లో ప్రయాణించే ఆసక్తి ఉన్న వారి దగ్గర నించి మొహమ్మద్ డబ్బు వసూలు చేసి, పేర్లు రాసుకున్నాడు.

మా ఓడ ఇజ్నా అనే ఊరిని సమీపించింది. స్కూల్‌కి వెళ్ళే టీనేజ్ కుర్రాళ్ళు డెక్ మీది రైలింగ్ వెనక కనిపించే బికినీల్లోని అమ్మాయిలని చూసి ఈలలు వేస్తూ, చేతులూపారు.

నైలు నదిలోని ఓ పెద్ద లాక్ దగ్గరకి ఓడ స్లో అయింది. మా ఓడ ముందు మరో రెండు ఓడలుండటంతో, వాటి వెనక ఆగింది. అంతా లాక్స్ ఓపెన్ అవడం చూడడానికి వేచివున్నాం.



చిన్న పడవల్లో ఈజిప్షియన్లు వచ్చి బట్టలు అమ్మేవాళ్ళు



లాక్స్ దగ్గర తెరుచుకున్న గేటులు

అకస్మాత్తుగా ఎరుపు - నీలం రంగు చిన్న తెడ్డు పడవల్లో అరబ్బు దుస్తుల్లోని కొందరు బట్టల వ్యాపారస్థులు మా ఓడని సమీపించి, ఆడవాళ్ళ చీరలని చూసి 'ఇండియా! టవల్. లుక్' అని అరిచారు. ఒకడు ఓ టవల్‌ని లాఘవంగా నలభై అడుగుల ఎత్తున్న డెక్ మీద పడేలా విసిరి, 'హలో! గుడ్‌ప్రైస్' అని అరిచాడు. పడవల్లోని వాళ్ళు దుప్పట్లని, షాల్స్‌ని విప్పితీసి డిజైన్స్ చూపించారు. ఒకోటి ఆరువందల ఈజిప్షియన్ పౌండ్స్ అని చెప్పారు. మా గ్రూప్ వాళ్ళకి ఓ యూరోపియన్ బ్రోకెన్ ఇంగ్లీష్‌లో ఏభై పౌన్లకి మించి చెల్లించద్దని చెప్పాడు.



పడవ వెళ్ళాక మూసుకుంటున్న గేట్లు

ముందు రెండు ఓడలు వెళ్ళాక మా ఓడ తెరచిన లాక్ తలుపులోంచి లోపలికి వెళ్ళగానే కింద నీరు దాదాపు పదిహేను అడుగులు తగ్గింది. ఓడ ఎత్తు తగ్గి సన్నటి కాలువలో పైన ఉన్న వంతెనకి తగలకుండా ముందుకి వెళ్ళింది. తర్వాత వెనక గేట్‌ని మూసి, ముందు నదిలోకి వెళ్ళే గేట్‌ని తెరిచారు. దాదాపు ఐదువందల అడుగుల మేర, అటూ ఇటూ కాంక్రీట్ గోడలమధ్య మా ఓడ లాక్‌లని దాటింది. నీటిమట్టం పెరగడంతో నది ఉపరితలానికి సమానంగా నీటిమీద లేచింది. అవతలి గేటుని తెరవగానే అది నైలు నదిలోకి తిరిగి ప్రవేశించింది. ఓడ బయటకి వచ్చాక వెనక గేట్‌ని మూసేసారు. ఇదంతా జరగడానికి ఉదయం పదకొండున్నర నించి పన్నెండున్నరదాకా గంట పట్టింది. నైలు నది మీద ఓడలని నియంత్రించడానికి ప్రభుత్వం వీటిని నిర్మించింది. ఈ ప్రక్రియని డాకింగ్ అన్నారు చెమటతో తడిసిపోవడంతో మా కేబిన్‌లోకి వచ్చి స్నానం చేసాం.

మధ్యాహ్నం ఒకటి నించి రెండుదాకా లంచ్. బ్రౌన్ రైస్, రుచికరమైన స్పైసెస్ కలిపిన వంకాయకూర, ఉప్పులో ఉడకపెట్టి రోస్ట్ చేసిన పొటాటో వెడ్జెస్, వెజ్ సలాడ్, మామిడి, జామకాయ ముక్కలు, తేనె, ఖర్జూరం, ఈజిప్షియన్ స్వీట్స్, కొన్ని నాన్ - వెజ్ ఐటెమ్స్ ఉన్నాయి. మనకి ఇండియాలో ఖర్జూరపు పళ్ళే కనపడతాయి. కానీ మొదటిసారిగా అక్కడ ఖర్జూరకాయని తిన్నాను. కొద్దిగా వగరుగా, కొద్దిగా తియ్యగా ఉంది. ఒకటింపావు నించి ఒకటిన్నరదాకా వర్షం కురిసింది. దారి పొడవునా ఒడ్డున ఖర్జూరం, చెరకు, మొక్కజొన్న అరటి చెట్లు పచ్చగా కనిపించాయి.

మా ఓడ రెండున్నరకి లక్సర్‌లోని తూర్పు తీరంలో ఆగింది. అంతా బోర్డింగ్ పాస్‌లు తీసుకున్నాం. మా ఓడకి, ఒడ్డుకి మధ్య మరో ఓడ ఉంది. దాని గేట్ తాళం తెరిస్తే దానిమీదుగా కిందకి దిగాం. పక్కన నీళ్ళల్లో చిన్న పడవలు, ఎదురుగా రోడ్, చిన్న చిన్న షాప్‌లు కనిపించాయి. ఇటీవలి తిరుగుబాటు ఈజిప్షియన్ టూరిజాన్ని కృంగదీసింది. పర్యాటకం మీద ఆధారపడ్డ వీరి ఆర్థికవ్యవస్థ బాగా దెబ్బతిందని, ఆలయ శిధిలాల వైపు నడుస్తూంటే దారిలోని షాప్స్‌ని చూస్తే అర్థమైంది. 'జస్ట్ లుక్! నో హేసెల్' అని పిలుస్తూ షాప్ వాళ్ళు మమ్మల్ని చూసి షాప్స్‌లో ఫేన్లు, లైట్లు వేయసాగారు.

నన్ను చూసి ఒకతను వాటిని వేస్తే, నేను షాప్‌లోకి రావడం లేదని, వాటిని ఆఫ్ చేయమని చెపితే, 'ఐ లైక్ ఇండియన్స్. సేం స్కిన్'(రంగు) అన్నాడు. ఓ షాప్‌లో పిరమిడ్స్, ఒబ్లిస్క్, కుక్క, పిల్లిలాంటి రాతి, చెక్క విగ్రహాలు దుమ్ముకొట్టుకుపోయి కనిపించాయి.

చందన కొన్ని బొమ్మలని పది పౌండ్లకి బేరమాడితే 'ఛారిటీ' అంటూ నవ్వి 'ఓకే' అన్నాడా యజమాని. ఆ నవ్వు ఇప్పటికీ నన్ను వెంటాడుతోంది. అసలు ధరకన్నా తక్కువకి అమ్మే నిస్సహాయపు నవ్వులా నాకు తోచింది. పూర్వం రోజుకి ఐదువేలమంది దాకా పర్యాటకులు ఉండేవారు. ఇప్పుడు ఐదువందల మంది కూడా లేకపోవడంతో వారి ఆదాయం బాగా దెబ్బతింది. మనిషికి కడుపు నిండాక కళలవైపు మొగ్గుతాడు. ఆ రోజుల్లో రాళ్ళని చెక్కడమే కళ. కడుపు నిండిన సంస్కృతులవి. ప్రపంచంలో మిగతా చోట్ల మనుషులు గుహల్లో జీవిస్తూ, పచ్చిమాంసం తినే రోజుల్లో ఏస్ట్రానమీ, ఇంజనీరింగ్, వైద్యంలాంటి వాటిలో అభివృద్ధి చెందిన సంస్కృతికి చెందిన దేశం ఇది.

లక్సర్ సిటీకి ప్రాచీన పేరు తెబెత్. ఈజిప్షియన్ భాషలో దీనర్థం పవిత్రస్థలం. క్రీస్తు పూర్వం 1400లో ఈ నగరం నిర్మించబడింది. ఇవన్నీ సేండ్ స్టోన్ నిర్మితాలే. ఇక్కడ నైలు నదికి తూర్పు, పడమర తీరాల్లోని రాళ్ళ ప్రాంతంలో అనేక గొప్ప ఆలయాలని ప్రాచీనులు నిర్మించారు. ఇక్కడ పర్యాటకులు అధికంగా సందర్శించే నాలుగు ఆలయాలు రామ్‌సేస్ - 2, రామ్‌సేస్ - 3 ఆలయాలు, ది టెంపుల్

ఆఫ్ సేథీ -1, ది టెంపులాఫ్ హట్‌షెప్ సట్. తూర్పు తీరంలోని మొదటి రెండు ఆలయ ప్రాంతాలని కర్నక్ అని కూడా పిలుస్తారు. ఈ ఆలయాల్లోనే ఈజిప్ట్ చక్రవర్తుల పట్టాభిషేకాలు జరిగుంటాయని భావిస్తున్నారు. అలెగ్జాండర్ ది గ్రేట్ కిరీటధారణ జరిగింది కూడా ఇక్కడే లక్సర్ ఆలయాలు దేవతల కోసం కాక చక్రవర్తుల పునరుజ్జీవనానికి అంకితం ఇచ్చిన ఆలయాలు. ప్రాచీన లక్సర్‌లో సన్ గాడ్, కింగ్ ఆఫ్ ది గాడ్స్ ఐన అమున్ - రేకి ప్రముఖ స్థానం ఇచ్చారు. క్రీస్తు పూర్వం 2000 నించి క్రీస్తు శకం 500 దాకా (2,500ఏళ్ళు) నైల్ నదికి ఇరువైపులా గల ఆ మొత్తం నగరం నాలుగు స్పష్టమైన విభాగాలుగా ఉన్న అనేక ఆలయాల సముదాయంగా ఉండేది. దీన్ని 'సూర్యోదయ భూమి'గా పేర్కొనేవారు.


గైడ్ అబ్బాసి

స్థానిక గైడ్ అబ్బాసిని మహ్మద్ మాకు పరిచయం చేసాడు. అతని వెంట రోడ్ క్రాస్ చేసాం. గుర్రం, గాడిదల బళ్ళు కొన్ని దారిలో కనిపించాయి. పర్యాటకులు లేక అవి ఖాళీగా ఉన్నాయి.


స్థంభాలున్న శిథిలాలయం

మేము రోడ్ క్రాస్ చేసిన చోట రోడ్‌కి ఆనుకుని మన వేయి స్థంభాలు లాంటి అనేక ప్రాచీన శిథిలాలు, మధ్యలో కంచె కనిపించాయి. దగ్గర దగ్గరగా చెక్కిన పదిహేను సేండ్‌స్టోన్ స్థంభాలు, వాటన్నిటిమీద ఎలాంటి చెక్కడాలు లేని దూలం కనిపించాయి. అలాంటివే కొన్ని స్థంభాల సమూహాలు కూడా కనిపించాయి. రోడ్ దాటి ఆలయ సముదాయం ఎంట్రన్స్‌లోకి వెళ్తే కార్ పార్క్ ఉంది. విశాలమైన ఆవరణలో ఆవల ఇనప కంచె, దాని వెనక పదకొండు ఎత్తైన స్థంభాలు, పైన దూలాలున్న వరస, ఇంకొంచెం ఎత్తులో ఏడు స్థంభాలు కనిపించాయి.


లస్కర్ ఆలయంలో ఈరోజుకీ పూలందుకుంటున్న మాస్క్

ఆ టెంపుల్ ఎంట్రన్స్ ఫీజ్ అరవై పౌన్లు. ఎంట్రన్స్‌లో అటు, ఇటు ఎత్తైన ప్రాచీన సేండ్ స్టోన్ ప్రహరీగోడలు, వాటి మధ్య దారికి కుడివైపు 36 అడుగుల ఎత్తున్న గ్రానైట్ రాతిలో చెక్కిన, కూర్చుని ఉన్న రామ్‌సేస్ - 2 విగ్రహం, ఎడమవైపు 80 అడుగుల ఎత్తుగల ఒబ్లిస్క్ కింది భాగంలో మొహాలు చేతులు చెక్కేసిన పురుషుల చిన్న విగ్రహాలు నాలుగు ఉన్నాయి. ముందుకి వెళ్తే అటు, ఇటు హైరో గ్లిఫిక్స్ చెక్కిన దాదాపు ఇరవై అడుగుల ఎత్తైన స్థంభాలు, వాటి మధ్య నించున్న రామ్‌సేస్ -2 విగ్రహాలు ఉన్నాయి. పైలాన్ గేట్‌లోంచి వెళ్తే, రామ్‌సేస్ - 2 ఎంట్రన్ కోర్ట్, అది దాటితే పాపిరస్ మొగ్గల ఆకారంలో చెక్కిన అతి భారీ స్థంభాలు కనిపించాయి. ఈ కోర్ట్‌లో దక్షిణ భాగంలో గ్రానైట్, గ్రానో - డయోరైట్ చేసిన విగ్రహాలున్నాయి. అవి రామ్‌సేస్ - 2 తన ముందు ప్రఖ్యాత చక్రవర్తులతో సమానంగా చేసుకున్నాడు.

తన 30 ఏట రామ్‌సేస్ - 2 నిర్మించినవి. రోమన్ కాలంలో ఈ ఆలయ సముదాయం ఓ కోటలా ఉండి, రోమన్ ప్రభుత్వం ఇక్కడ నించే పనిచేసేది. లక్సర్ ఆలయాలని క్రీస్తు శకం 395లో రోమన్స్ చర్చ్‌గా, 640లో ముస్లిం పాలకులు మసీదుగా మార్చారు. అంటే, 3,400 ఏళ్ళుగా మతారాధన కొనసాగే, ప్రపంచంలోని అతి తక్కువ ఆలయాల్లో ఇదొకటి. నేటికీ ఉపయోగించే ఆ మాస్క్ పేరు అబూ హగాగ్ మాస్క్. అక్కడ చుట్టూ ఉన్న స్థంభాలని, విగ్రహాలని తాకకుండా అడ్డుగా తాడుని కట్టారు. ఓ ఆలయంలో ఒకే స్థంభాన్ని ఏడెనిమిది చిన్న స్థంభాల సమూహంగా చెక్కారు. గైడ్‌ని అడిగితే, లోపల గోడల మీద చెక్కిన దేవతల, మనుషుల బొమ్మలకి వేసిన రంగులు ఆనాటివేనని, మళ్ళీ వేయలేదని చెప్పాడు.

1832లో ఈ ఆలయం ముందు రెండు ఒబ్లిస్క్‌లు ఉండేవి. ప్రస్థుతం ఒక్కటి మాత్రమే ఉంది. రెండోది లస్కార్ ఒబ్లిస్క్ పేరుతో పేరిస్‌కి తరలించబడింది. అదిప్పుడు పేరిస్‌లోని 'ప్లేస్ డి లా కంకార్డ్' అనే పంతొమ్మిది ఎకరాల విశాలమైన అతి పెద్ద పబ్లిక్ స్క్వేర్‌లో ఉంది. (ఫ్రెంచ్ తిరుగుబాటు సమయంలో పదహారో లూయికి, ఇంకా ఇతర ప్రముఖులకి మరణశిక్ష విధించింది ఈ స్క్వేర్‌లోనే)

1884లో ప్రొఫెసర్ గేస్టన్ ఛార్లెస్ మేస్ట్రో (1846 -1916) అనే ఫ్రెంచ్ దేశస్థుడు లక్సర్ తవ్వకాలని ఆరంభించాడు. 1960దాకా దాదాపు ఏభై అడుగులు కృత్రిమ గుట్టలో తవ్వకాలని కొనసాగించి ఈ ఆలయాన్ని, కొలనేడ్‌లని (స్థంభాలని) వెలికి తీసారు. ఇప్పటికీ తవ్వకాలు కొనసాగుతున్నాయి.


రెండు ఆలయ కాంప్లెక్స్‌లని కలిపే (కర్నక్, లక్సర్) మూడు కిలోమీటర్ల పవిత్ర మార్గం ఉంది. ఈ మార్గం మీద ప్రాచీన మాన్యుమెంట్స్ నించి తీసుకున్న సేండ్ స్టోన్ రాతిపలకలు పరిచారు. దారికి అటూ, ఇటూ దిమ్మల మీద ఏండ్రో స్పింక్స్ తలలున్నాయి. చక్రవర్తి తల, సింహపు శరీరం గల స్పింక్స్ విగ్రహాలు చక్రవర్తికి ప్రకృతి మీద గల శక్తి, ఆధిపత్యానికి ప్రతీకలు. దీన్ని అవెన్యూ ఆఫ్ స్పింక్సె అంటారు. లస్కర్ ఆలయాలు ఈజిప్షియన్ చక్రవర్తిని దేవుడి ప్రతినిధిగా భావించి నిర్మించబడ్డాయి.

"ఆ రోజుల్లో వారానికి పదిరోజులు ఇక్కడ, రేపు మీరు చూడబోయే 'వేలీ ఆఫ్ ది కింగ్స్'లో పని చేసిన కార్మికులకి వారానికి రెండు రోజులు శెలవు దినాలు. కార్మికులు సూర్యోదయం నించి సూర్యాస్థమయందాకా పని చేసేవారు. ఆ రెండు రోజులు కుటుంబ సభ్యులతో గడిపేవారు" గైడ్ అబ్బాసి చెప్పాడు.

ఓ హైరో గ్లిఫిక్‌ని చూపించి ఫోటో తీసుకోమని ఇలా చెప్పాడు.

"ఇది ఈజిప్షియన్ భాషలోని అంకె. 10,53,351. రామ్‌సేస్ - 2, దేవుడ్ని అన్ని సంవత్సరాల ఆయుష్షు అడిగాడు.

ఆలయాల్లో ఎలక్ట్రిక్ లైట్లు వెలుగుతున్నాయి. నేలమీద చెక్కలు పరిచారు. చాలా విగ్రహాలని ధ్వంసం చేసారు. ఓ చోట ముక్కు పూర్తిగా చెక్కేసిన విగ్రహం కనిపించింది. మనిషిలో కళాసృష్టికన్నా విధ్వంస స్వభావం అధికంగా ఉంటుంది అనిపించింది.


లస్కర్ లోని రామసేసు
ఆలయం బయట విగ్రహం

ఇక్కడి ప్రధానాకర్షణలు సేంక్చువరీ ఆఫ్ లక్సర్ టెంపుల్, పదకొండు స్థంభాల మీద సీలింగ్ లేని అమెన్ హోటెప్ -3 సన్ కోర్ట్, అవెన్యూ ఆఫ్ స్పిక్సెస్. రామ్‌సేస్ -2 ఆలయ కాంపౌండ్ వాల్ బయటి ఒబ్లిస్క్, ది గ్రాండ్ కోలనేడ్, రెండు పెద్ద స్థంభాల వరస మధ్య దారి గల సెబన్ ట్రియడ్ బార్క్ ష్రైన్.

నైలు నదికి పశ్చిమ తీరంలో లక్సర్ మ్యూజియం ఉంది కాని అది మా ఐటనరీలో లేదు కాబట్టి చూడలేదు.

నూట పదమూడు డిగ్రీల ఫారిన్ హీట్ ఎండ ఉండటంతో మాడిపోయాం. అక్కడ నించి తిరిగి ఆరుంపావుకి ఓడ దగ్గరకి చేరుకున్నాం. అక్కడ మా ఓడ పక్కనే ఆగివున్న ఐదు ఓడలని చూసాం. కేవలం ఒకే బల్బ్ వెలిగా వాటిలో పర్యాటకులు లేరు. (నేటి కరోనా కాలంలో ప్రపంచంలోని అన్ని పర్యాటక కేంద్రాల్లో ఇలా ఒకే లైట్ వెలుగుతూ, వారందరి ఆదాయాలు దెబ్బతిన్నాయి)


కొలోసియా ఆఫ్ మెమ్నాన్ కవల విగ్రహాలు

ఓడలో ఆఖరి రోజు కాబట్టి రాత్రి ఏడునించి ఎనిమిది దాకా బెల్లీ డేన్స్‌లాంటి వినోద కార్యక్రమాలు జరిగాయి. మా టూర్ మేనేజర్ మహమ్మద్ మర్నాటి కార్యక్రమాన్ని చెప్పాడు.

"ఉదయం ఏడుకి సామాను మీ కేబిన్స్ బయట ఉంచాలి. రేపు లక్సర్ సిటీ టూర్, వేలీ ఆఫ్ ది కింగ్స్ ముగించుకుని హోటల్ జాలీవిల్‌లో దిగుతాం. రాత్రి అక్కడ ఉండి ఎల్లుండి ఉదయం ఎయిర్‌పోర్ట్‌కి బయల్దేరుతాం."

**27-10-2015 మంగళవారం - 10వరోజు**

ఉదయం ఏడుకల్లా మా సామాను కేబిన్ బయట ఉంచాం. ఏడున్నరకి ఓడ దిగాం. నిన్నటి గైడ్ అబ్బాసి 999 నంబర్ గల కోచ్‌లో వచ్చాడు. ఆ బస్‌లో నైల్ నదికి పశ్చిమ తీరంలోని రోవేలీ 'ఆఫ్ ది కింగ్స్'కి బయలుదేరాము. అబ్బాసి అందరికీ వేలీ ఆఫ్ ది కింగ్స్ ఎంట్రన్స్ టిక్కెట్లు ఇస్తూ చెప్పాడు.

"నో కెమేరా. సెల్ ఫోన్స్ ఒకె. నో పిక్చర్స్. ఫొటోలు తీస్తే మెమరీ కార్డ్‌ని పారేస్తారు. గార్డ్‌లు ఫోటోలు తీసుకోమని చెప్పి డబ్బులడుగుతారు. కానీ అది చట్టవిరుద్ధం. ప్రతి సీజన్‌లో రోజుకి ఐదువేల మందినే సమాధుల్లోకి అనుమతిస్తారు. కానీ ఇప్పుడు రోజుకి అంతమంది రావడంలేదు. టిక్కెట్లు జాగ్రత్త. అవి పోతే లోపలికి రానివ్వరు. అప్పుడు మా వెంట రాలేరు. మేము తిరిగి వచ్చేదాకా బస్‌లో కూర్చోవాల్సి ఉంటుంది" హెచ్చరించాడు.

ఎంట్రన్స్ టిక్కెట్ వంద పౌండ్లు.

అరగంటలో బస్ ఆగింది. ఆ ఆవరణలో దాదాపు ముప్పై అడుగుల చిత్రమైన విగ్రహాలు కనిపించాయి. ఈ రెండూ కొలోసియా ఆఫ్ మెమ్నాన్ కవల విగ్రహాలు. గ్రీక్ పురాణప్రకారం ఇయోస్ కొడుకు మెమ్నాన్‌ని గాడ్ ఆఫ్ డాన్‌గా భావించేవారు. అతన్ని అచిలెస్ చంపాడు. ఇవి క్రీస్తు పూర్వం 1350 నాటివి. ఇవి ఓ ఆలయంలో ఉండేవి. కానీ క్రీస్తు పూర్వం 27లో వచ్చిన భూకంపం వల్ల ఆలయ కప్పు కూలి, ఎడమ (ఉత్తర) విగ్రహానికి సగభాగం బీటలిచ్చింది. అప్పటినించి ఇవి అనేక శతాబ్దాలుగా నైలునది వరదలు, ఎడారి వేడి గాలులు, ఇసుక తుఫానులని భరించి నిలబడ్డాయి. వీటి పెడెస్టల్స్ సైడ్ పేసల్స్ మీద నైలు నదీ దేవత ఆకృతిని చెక్కారు. క్రీస్తుపూర్వం 20 కల్లా సూర్యుడి మొదటి సూర్యకిరణం కనపడగానే పగిలిన విగ్రహం నించి వింత శబ్దాలు వెలువడసాగాయి. వీటిని వినడానికి చాలామంది చుట్టుపక్కలనించి వచ్చేవారు. అది మెమ్నాన్ తన తల్లి కోసం ఏడవడంగా అంతా భావించేవారు.

కానీ రోమన్స్ క్రీస్తు శకం 3వ శతాబ్దంలో ఆ విగ్రహం నోటిని మూసేసారు. రోమన్ చక్రవర్తి సెప్టిమియస్ సెవెరసస్ పగిలిన ఆ విగ్రహానికి మరమ్మత్తులు చేయించాడు. దాంతో ఆ ధ్వనులు ఆగిపోయాయి. ఆధునిక శాస్త్రజ్ఞుల ప్రకారం ఉదయపు సూర్యుడి వేడి కిరణాలు ఆ పగుళ్ళలో పడి, రాత్రి ఏర్పడ్డ తేమని ఆవిరయ్యేలా చేయడంతో, ఆ ఎడారి సన్నటి వైబ్రేషన్స్ కలగడంద్వారా ఆ ధ్వని తరంగాలు పుట్టేవి.

లక్సర్‌కి పశ్చిమ దిశలో ఎడారి కొండ శిఖరాల్లోని ది వేలీ ఆ ఫ్ ది కింగ్స్, వేలీ ఆఫ్ ది క్వీన్స్ మరణించిన చక్రవర్తుల సమాధులు (క్రీస్తుపూర్వం 1550 - 1000కి చెందిన డైనాస్టీస్ 18-20) కొత్త రాజ్యాన్ని కాపాడతాయని నమ్మేవారు. సూర్యాస్తమయం జరిగే దిక్కు కాబట్టి దాన్ని వారు మరణానికి గుర్తుగా భావించి అక్కడ సమాధులని ఏర్పాటు చేసారు. ఈ ప్రాంతాన్ని డెడ్ రోజ్ లేండ్‌గా పేర్కొనేవారు. ప్రాచీన ఈజిప్షియన్స్ సమయం సదా గుండ్రంగా తిరిగే సర్కిల్‌గా భావించేవారు. కర్నక్ ఆలయానికి చెందిన అమున్ - రే లక్సర్ ఆలయానికి ఏడాదికోసారి తిరిగి వచ్చి, మళ్ళీ సృష్టిని చేసి, ఒపెట్ ఉత్సవ సమయంలో తిరిగి పుడతాడని నమ్మేవారు. అది ఈజిప్షియన్ మత కేలండర్‌లో అతి ప్రాముఖ్యమైంది. ఎంట్రన్స్ టికెట్స్ చూపించి లోపలికి వెళ్ళాం. అంతటా తవ్వకాలు జరుగుతున్న ట్రెంచెస్ కనిపించాయి. అబ్బాసి మమ్మల్ని ఓ చోట నిలబెట్టాడు. కొద్దిసేపటికి మూడు పెట్టెల చిన్న టైర్ ట్రామ్ వచ్చింది. అంతా దాన్ని ఎక్కాం. ఆ ట్రామ్ చప్పుడు చేస్తూ బయలుదేరి కొండగుట్టల్లో మలుపులు తిరుగుతూ ప్రయాణించింది. దారిలో తవ్వకాలు జరిపే పురావస్తు శాస్త్రజ్ఞులు కనిపించారు. ఐదు నిమిషాల్లో ట్రామ్ ఓ గుట్ట దగ్గర ఆగింది. అంతా దిగి అబ్బాసి వెంట సేండ్ స్టోన్ పరిచిన మార్గంలో కొండలోని సమాధుల్లోకి నడిచాము. మేం మొదటగా చూసింది రామ్‌సేస్ - 3 సమాధి. సమాధి లోపలకి దిగడానికి చెక్కల రేంప్, దానికి అటు, ఇటు పడిపోకుండా జాలీ కట్టారు. లోపల చెక్కలతో నిర్మించిన వాక్‌వే మీద నడుస్తూంటే గోడలకి అటూ, ఇటూ నీలం, ఎరుపు, ఆకుపచ్చ, పసుపుపచ్చ రంగులు పూసిన హైరోగ్లిఫిక్స్ బొమ్మలు చాలా ఉన్నాయి. రంగులు ఇంతకాలం వెలిసిపోకుండా అద్భుతంగా ఉండడానికి వాళ్ళు ఏం కలిపారో మరి. రామ్‌సేస్ డైనాస్టీలోని చక్రవర్తులందరినీ రామ్‌సేస్ అనే పేరుతో పిలిచేవారు. మగ సంతానానికి అందరికీ రామ్‌సేస్ అనే పేరే పెట్టేవారు. దానర్థం చక్రవర్తి, యుద్ధవీరుడు.



వాలీ ఆఫ్ కింగ్స్ లో ఇప్పటికీ తవ్వుతున్న కొండలు

"బ్రిటిష్‌వాళ్ళు రామ్‌సేస్ -2 సమాధిలోని విలువైనవి దొంగిలించి ఇంగ్లండ్‌కి తరలించారు. అలా దొంగిలించిన విలువైన వస్తువులతో అలెగ్జాండ్రియా రేవు నించి బయల్దేరిన ఓడ మార్గమధ్యమంలో మునిగిపోయింది. 2001లో ఓ ఫ్రెంచ్ పురావస్తు పరిశోధకుడు ఆ ఓడని కనుగొని వాటిని వెలికితీసాడు. గ్రానైట్ విగ్రహాలు వేలముక్కలై కనిపించాయి. ఇక్కడి ఖమూన్ సమాధిని ఓ బ్రిటిష్ పురావస్తు పరిశోధకుడు కనిపెట్టాడు" గైడ్ చెప్పాడు.

ఇక్కడ ఓ గదిలో ఏడుమీటర్ల లోతుగల బావి ఉంది. వర్షపు నీరు బావిలోకి వెళ్ళే ఏర్పాటు చేసారు. ఓ సమాధి పది మీటర్ల పొడవు, పదిమీటర్ల లోతు ఉంది ఈ కొండల్లో ఇంకా తవ్వకాలు జరగని చాలా సమాధులున్నాయని గైడ్ చెప్పాడు. కొందరు రాణుల సమాధులు పక్కనే ఉన్నాయి. ఈ మమ్మీల ఆత్మలు స్వర్గం నించి వచ్చి ప్రార్థించి, తమ భౌతిక కాయాలని చూసి తిరిగి స్వర్గానికి వెళ్తాయని ఆ రోజుల్లో నమ్మేవారు. అప్పట్లోనే ఈజిప్షియన్స్‌కి భూమి గుండ్రంగా ఉందని తెలుసని అక్కడి గోడల మీది బొమ్మలని బట్టి అర్థమౌతుందని, గైడ్ అలాంటివి కొన్ని చూపించాడు.

గైడ్ మాలో ఇద్దర్ని ఓ స్థంభానికి అటూ ఇటూ చేతులు చాపి నిలబెట్టాడు. ఒకరి చేతులు మరొకరికి అందలేదు. అంత ఎక్కువ చుట్టుకొలత ఉందా స్థంభానికి. క్యూ ఉండటంతో మా బేచ్ కేవలం పదినిమిషాలు మాత్రమే రామ్‌సేస్ -2 సమాధిలో ఉండగలిగాం.

తర్వాత బయటకి వచ్చి పక్కనే ఉన్న మరో గుట్టలోకి నడిచాం. రామ్‌సేస్ -9, రామ్‌సేస్ 10 సమాధులు ఖాళీగా ఉన్నాయి.

రామ్‌సేస్ -9 ఎదురుగా మరొకరి సమాధి ఉంది. కానీ దాన్ని మూసేసారు. దానికి కొద్దిగా ఎడమవైపు పైన చెక్కిన మతపరమైన పుస్తకాలని గైడ్ చూపించి చెప్పాడు.


ట్రామ్ వేపు నడుస్తున్న తోటి ప్రయాణికులు

"ప్రతీ చక్రవర్తి ఒకో పుస్తకాన్ని ఎన్నుకున్నాడు."

అక్కడి అరవై నాలుగు సమాధుల్లో కేవలం మూడే చూసాం. అవి రామ్‌సేస్ -2, ఫారో హట్‌షెప్సుట్, టూటెన్ ఖామెన్ -2. ఆ మూడు సమాధుల్లోని రహస్యగదుల్లో ఆ చక్రవర్తుల మమ్మీలున్నాయి.

కెవి -1, కెవి -2 (కింగ్స్ వేలీ -1) ఇలా సమాధులకి నంబర్లు ఇచ్చారు. కెవి -62 టూటెన్ ఖామెన్ సమాధి. ఇలా కెవి - 64దాకా నంబర్లున్నాయి. ఇంకా కొన్ని సమాధులు ఎవరివో తెలియాల్సి ఉంది.

"కొన్ని సమాధుల్లోకి ప్రవేశించడం ప్రమాదకరం. కారణం పాములు, తేళ్ళు, ఇంకా అవి కూలిపోయే పరిస్థితుల్లో ఉండటం కూడా. కొన్ని సమాధులని పునర్నిర్మించడానికి మూసేసారు. ఓ సమాధిని సందర్శకుల కోసం ఓ నెల తెరిచాక ఆరు నెలలు మూసేస్తూంటారు. కారణం మనుషుల శ్వాస నించి వచ్చే తేమ ఆ సమాధుల గోడల మీది రంగులని పాడుచేస్తుందని. రామ్‌సేస్ -4, రామ్‌సేస్ -9, హట్ షెప్సుట్ సమాధులు అందమైనవి. ముఖ్యంగా హట్‌షెప్సుట్ సమాధి నూట ఏభై మీటర్ల పొడవు, పదిహేను మీటర్ల లోతులో ఉంది. దీన్ని టెంపుల్ ఆఫ్ క్వీన్ అంటారు. ఆమెకి చక్రవర్తి దుస్తులు తొడిగారు" గైడ్ చెప్పాడు.

అమున్ - రేని, చక్రవర్తులని అస్తమించే సూర్యుడిగా ఆరాధించేవారు. తూర్పు తీరంలోని ఆలయానికి సూటిగా నైల్ నదికి ఆవల మార్చురీ ఆలయాలకి దక్షిణం వైపు ఓ చిన్న హట్ షెప్సుట్, టుట్ మోసిస్ -3 (క్రీస్తుపూర్వం 1479 -1425) ఇంకా అమున్ - రే ఆలయం ఉంది. ఇందులో అమున్ - రే, మరో ఎనిమిదిమంది ముఖ్యమైన దేవతలని పాతిపెట్టారని పురావస్తు పరిశోధకుల నమ్మకం. ఈ ఆలయం రామ్‌సేస్ - 3 సమాధి ఆవరణలో ఉంది.

చుట్టూ కొండలు, మధ్యలో తవ్వకాలు జరిగే ఆ ప్రదేశం నించి పది పదికి బయల్దేరాం

మళ్ళీ ట్రామ్ ఎక్కి బయల్దేరిన చోటికి వచ్చి బస్ ఎక్కాం. కొందరు నడవలేని వాళ్ళు బస్‌లోనే కూర్చుని ఉన్నారు. పర్యాటకం ఏభై లేదా అరవై ఏళ్ళ లోపే చెయ్యాలి. డెబ్బైలలోని వాళ్ళు నడవలేక బస్‌లోనే కూర్చోవాల్సి వస్తుందని ఈ ట్రిప్‌లో నాకు అర్థమైంది.

ఓ అమెరికన్ వృద్ధ పర్యాటక బృందం బస్‌లో హాలండ్‌లోని ఓ ఛీజ్ ఫాంని సందర్శించింది. ఓ యువగైడ్ గొర్రెపాలనించి ఛీజ్‌ని ఎలా చేస్తారో వివరించాడు. దూరంగా కొండల్లో మేసే చాలా గొర్రెలని చూపించాడు.

"ఇవి?" చుట్టూ కంచెగల చోటున్న గొర్రెలని ఏం చేస్తారు?" ఆ యువగైడ్ అడిగాడు.

"పర్యాటక బృందాలుగా పంపుతారు" ఓ వృద్ధుడు నవ్వుతూ చెప్పాడు.

నిజమే. యవ్వనంలో పర్యటనలకి డబ్బుండదు. డబ్బొచ్చేసరికి వయసొచ్చేస్తుంది.

వేలీ ఆఫ్ ది కింగ్స్ నించి బస్‌లో పదింపావుకి సమీపంలోని క్రాఫ్ట్‌మెన్ విలేజ్‌కి చేరుకున్నాం. అక్కడి అలబస్టర్ స్టోన్ ఫేక్టరీ గైడ్ మాకు స్వాగతం చెప్పి కొంత సమాచారం చెప్పాడు.

"ఈజిప్షియన్స్ చెక్కడానికి తొమ్మిది రకాల రాళ్ళని ఉపయోగిస్తారు. సేండ్ స్టోన్, లైమ్ స్టోన్, మూన్ స్టోన్ అలబస్టర్, గ్రానైట్, సెమీ ప్రెషస్, ప్రెషస్ స్టోన్. ఓ రకం రాతిని సౌత్ ఆఫ్రికా నించి దిగుమతి చేసుకుంటారు. చివరగా డైమండ్ మాకు డైమండ్ మైన్స్‌లేవు."

సౌత్ ఆఫ్రికా నించి దిగుమతి చేసుకున్న రాయిని ముట్టుకుంటే మెత్తగా ఉంది.

"దీన్ని దేంతో చేసారు?" అని ఓ విగ్రహం ఏ రాయితో చేసిందో క్విజ్ పెట్టాడు.

"అలబస్టర్" చెప్పాను.

తర్వాతి ప్రశ్న అది ఏ విగ్రహం?

"పిల్లి" మళ్ళీ చెప్పాను.

సరైన సమాధానాలు చెప్పినందుకు నాకో చిన్న తాబేలు బొమ్మ ఇచ్చాడు. అలబస్టర్ అని నాకు తెలిసి చెప్పలేదు. చెప్పింది లక్కీగా కరెక్టైంది.

"నా వయసు రామ్‌సేస్ -2 వయసుకన్నా నలభై ఏళ్ళు తక్కువ. ఇప్పుడు నా వయసెంత?"

ఆ మూడో ప్రశ్నకి ఎవరూ జవాబు చెప్పలేకపోయారు.

"నా వయసు ఏభై ఏడు. రామ్‌సేస్ -2 తొంభై ఏడేళ్ళు జీవించాడు. చివరి ప్రశ్న. రామ్‌సేస్ - 2కి రెండు వందలమంది పిల్లలు. నాకు ఎంతమంది?" ఆయనే జవాబు చెప్పి అడిగాడు.

ఒకటి, రెండు, మూడు అని జవాబులు చెప్పాం. మూడున్నర అని చెప్పి ఓ చిన్నపిల్ల గెలిచింది. ముగ్గురు పిల్లల తర్వాత అతని భార్య గర్భవతి.

"దయచేసి సాధ్యమైనన్ని ఎక్కువ కొనండి. మా క్రాఫ్ట్‌మెన్ ఆదాయం లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ గ్రామస్థులు ఐదువేల సంవత్సరాల నించి తరతరాలుగా విగ్రహాలు చెక్కడమే చేస్తున్నారు. వారికి ఇంకేపనీ చేతకాదు. ఐదువేల సంవత్సరాలనించి వాళ్ళు ఈ గ్రామాన్ని వదిలి వెళ్ళలేదు" అతను అందర్నీ కోరాడు.

అటూ ఇటూ గుడారాలు. వాటిలో ఆలివ్ గ్రీన్ అరేబియన్ అంగరఖాలని ధరించిన వర్కర్స్ రెండు వరసల్లో నేలమీద కూర్చుని రాళ్ళని విగ్రహాలుగా చెక్కుతున్నారు. ఇది వారికి వంశపారంపర్యంగా వచ్చిన విద్య. గుడారాల చివర్లో సువెనీర్ షాప్ ఉంది. పిల్లులు, కుక్కలు, హాట్ షెప్సట్ రాణి, ఫారోలు మొదలైన విగ్రహాలు కనిపించాయి. బేరమాడకుండా పది పౌండ్లకి ఓ రాతి తాబేలు బొమ్మని కొన్నాము. అక్కడసందర్శకులకి ఉచితంగా హైబిస్కస్(మందారం) టీని ఇచ్చారు. కావాలంటే అక్కడి హుక్కా కూడా తాగొచ్చు.

పన్నెండు ఏభై ఐదుకి బయటకి వచ్చి బస్సెక్కి లంచ్‌కి బయల్దేరాం. ఆ రోజు లంచ్ ఎస్.ఓ.టి.సి ప్రోగ్రాంలో లేదు. తొమ్మిది డాలర్లు మార్చుకుంటే ముప్పై పౌన్లు వచ్చాయి. గైడ్ అల్ కుజార్ అనే స్థానికుడు నడిపే ఓ చిన్న రెస్టేరెంట్‌కి తీసుకెళ్ళాడు. ఏభై పౌన్లకి చాలా చక్కటి భోజనం పెట్టారు. లెంటిల్ సూప్(చాలా రుచిగా ఉంది) సేఫన్ రైస్, చక్రాలుగా కోసి స్పైస్ పౌడర్‌తో బేక్ చేసిన వంకాయలు, బంగాళాదుంపల్ అకూర, వెజ్ సలాడ్, మిడిల్ ఈస్ట్ ఐటమ్స్ అయిన పీటా బ్రెడ్, ఫలాఫెల్, హమ్మస్, నాలుగు రకాల స్వీట్స్, (బక్లావా, గుల్లాష్, కుణఫా,(బెనారస్ పాప్డీలా ఉంది) బెస్‌బూసా (సేమ్యాతో చేసిన స్వీట్) సైది (లస్సీ)లాంటి స్వీట్స్, జామకాయ ముక్కలు, జామ జ్యూస్, పళ్ళు మొదలైనవి ఉన్నాయి. ఐదంగుళాల పొడవున్న పచ్చిమిర్చి కారం లేదు. ఎండు ఖర్జూరపు కాయలు ఇక్కడ కూడా ఉన్నాయి. ఎస్.ఓ.టిస్ సజెషన్ ఫాంలో ఇలాంటి రెస్టేరెంట్స్‌ని ఎన్నుకోమని, టూర్లో మేం తిన్న ఏ ఇండియన్ రెస్టేరెంట్ ఈ స్టాండర్డ్‌లో లేదని సూచించాను. దాని యజమాని పెళ్ళిళ్ళల్లోలాగా కడుపునిండా తినమని ప్రేమగా మారు వడ్డన చేసాడు. గాడ్ బ్లెస్ హిమ్.

రెండు ముప్పై ఐదుకి బస్ ఎక్కాం. ఆ చిన్న గ్రామంలో బస్ దగ్గరకి వచ్చిన చిన్న పిల్లల్లో ఒకరు నా టోపీ అడిగితే మా రెండు ఎస్.ఓ.టిసీ టోపీలు వాళ్ళకిచ్చాను. మూడో తమ్ముడికి ఇవ్వడానికి మా దగ్గర లేకపోయింది. గైడ్ మమ్మల్ని ఎల్ అమన్ వీధిలోని ఈజిప్షన్

అనే పాపిరస్ షాప్‌కి తీసుకెళ్ళాడు. అక్కడి గుర్రాలు, గాడిదల వల్ల ఈగలు బాగా ముసురుతున్నాయి. పక్కనే ఉన్న కాటనైల్ అనే ఈజిప్షియన్ కాటన్ దుస్తుల దుకాణానికి కూడా తీసుకెళ్ళాడు. అక్కడ అన్నీ ఖరీదుగా ఉండటంతో ఎవరూ కొనలేదు. దీనికి కైరో, అస్వాన్‌లలో మరో రెండు బ్రాంచీలు కూడా ఉన్నాయి. నాలుగుకి బస్‌లో హోటల్‌కి బయల్దేరాం. గైడ్ అబ్బాసి మాతో రాకుండా ఆగిపోయాడు.

"మనం డిన్నర్‌కి బైటకి వెళ్తాం. కాబట్టి అంతా లాబీలో ఏడున్నరకి కలవాలి. ఈ రాత్రి తొమ్మిదికి కర్నక్ ఆలయంలో లైట్ అండ్ సౌండ్ షో ఉంది వెళ్ళాలనుకున్న వాళ్ళు ముందుగా బుక్ చేసుకోవాలి" మొహమ్మద్ బస్‌లో అందరికీ చెప్పాడు.

పగలంతా ఎండలో తిరిగి అలసిపోవడంతో మేము వాటికి వెళ్ళదలచుకోలేదు. గాలి తీవ్రత వల్ల హాట్ ఎయిర్ బెలూన్ ట్రిప్ రద్దై ఆ డబ్బుని తర్వాత వెనక్కి తిరిగి ఇచ్చేసారు. కర్నక్ లైట్ అండ్ సౌండ్ షో అసలు బాలేదని, వృధా అని, కూర్చోడానికి లేక అంతసేపు నుంచునే ఉన్నామని దానికి వెళ్ళిన చందన, చంద్ర తర్వాత చెప్పారు.

బస్‌లో మొహమ్మద్ అందరికీ ఎస్.ఓ.టిసి ఫీడ్ బేక్ ఫాం ఇచ్చి నింపి ఇవ్వమన్నాడు. లక్సర్‌లో, కింగ్స్ ఐలాంట్‌లోని హోటల్ జూలీవిల్ చేరుకున్నాం. లేబుల్స్ ఇచ్చి మా లగేజ్ మీద కాటేజ్ నంబర్ రాసి అతికించమని రెసెప్షనిస్ట్ కోరింది. మా పేర్లు పిలిచి తాళంచెవులు ఇచ్చేలోపల మహమ్మద్ మర్నాటి ప్రోగ్రాంని చెప్పాడు.

"ఉదయం 4.30కి వేకప్ కాల్, 5.30కి సామాను కాటేజ్ బయట ఉంచాలి, 6.30కి లాబీలో సామాను గుర్తించి బస్‌లో పెట్టించాలి. ఇక్కడినుంచి సరాసరి ఏర్‌పోర్ట్‌కి వెళ్తాం."

ఆ హోటల్ మెయిన్ బిల్డింగ్ వెనక విశాలమైన గార్డెన్‌లో కాటేజెస్ (వాటిని వారు బంగ్లాలు అన్నారు) ఉన్నాయి. మా కాటేజ్ నంబర్ టి - 17. హోటల్ సిబ్బంది మా పెట్టెలని పెద్ద ట్రాలీలో పెట్టి తెచ్చిచ్చారు. కాటేజ్‌లో కాఫీ పెర్కొలేటర్ ఉంది. పద్మజ కాఫీ తాగాలనుకోవడంతో కప్పుల కోసం చూస్తే లేవు. రెసెప్షన్‌కి ఫోన్ చేస్తే బాత్‌రూంలో చూడమన్నారు. కానీ అక్కడా లేవని చెపితే కొద్దిసేపట్లో పంపించారు.

డిన్నర్‌కి రాత్రి ఏడూ ఏభైకి గ్రాండ్ హోటల్‌కి వెళ్ళాం. ఈ హోటల్ ఖాలెద్ ఎజెన్ ఎల్ వాలెద్ స్ట్రీట్లో ఉంది. ఇందులోని కొన్ని రెస్టరెంట్ల బయట లోపల ఎన్ని సీట్లున్నాయో బయట బోర్డ్ పెట్టారు. కొరియన్ ఫుడ్ మాత్రమే సర్వ్ చేసే రెస్టరెంట్,(150), ఈజిప్షియన్ ఫుడ్ సర్వ్ చేసే ఈస్టర్న్ రెస్టరెంట్(200) అల్ కార్మ్ (80) చైనీస్ ఫుడ్ సర్వ్ చేసే రెడ్ డ్రాగన్ (250) క్లియోపాత్ర బార్ (100)

కర్నక్ ఆలయంలో లైట్ అండ్ సౌండ్ షోకి వెళ్ళేవాళ్ళు ముందు బేచ్. తర్వాత మేం తిన్నాం. బస్‌లో వాళ్ళని తీసుకెళ్ళారు. మేం వెళ్ళిన రెస్టరెంట్‌లో మూడు రకాల వెజ్ సలాడ్స్, ఫిష్, మూడు రకాల నాన్‌వెజ్ ఐటెమ్స్, ఎండు ఖర్జూరాలు, స్పినాచ్ అండ్ ఛీజ్ లసానె, పాస్తా(ఇటాలియన్) రైస్, వెజిటబుల్ సలాడ్ పాస్తా ఎప్పుడూ బ్లాండ్‌గా ఉంటుంది కాబట్టి మేమిద్దరం తినం. డిజర్ట్‌గా అనేక రకాల కేక్స్ ఉన్నాయి. వాటిలో ఎగ్ ఉంటాయని ముట్టుకోలేదు. కాల్చిన వంకాయని కలిపిన పెరుగు, అన్నంతో తిన్నాం. లంచ్‌తో పోలిస్తే ఈ భోజనం రుచిగా లేదు. ఖర్జూరాల ప్లేట్‌లో పదిహేనుంటే నేను రెండు వేసుకుని పక్కకి వెళ్ళాను. నా వెనక వచ్చిన మా బృందంలోని ఓ తమిళియన్ మిగిలిన మొత్తం తన ప్లేట్‌లో కుమ్మరించుకున్నాడు. ఇలాంటి పనులు చేయకూడదని చిన్నప్పటి నించే కుటుంబ పెద్దలు పిల్లలకి నేర్పించాలి. ఆ బౌల్‌ని హోటల్ వాళ్ళు మళ్ళీ నింపలేదు. తిన్నాక బస్ వచ్చేదాకా వేచి ఉండి రాత్రి 9కి బయలుదేరి, 9.20కి మా కాటేజ్‌కి చేరుకున్నాం.

ఎస్.ఓ.టిసి ఫీడ్ బేక్ ఫాంని మహమ్మద్ కి ఇచ్చాను. అన్నీ నో టిక్ చేసాను - ఒక్క లోకల్ గైడ్స్ తప్ప. గుడ్ టిక్ చేయడానికి వారు తప్ప ఇంకేం కనిపించలేదు.

కాటేజ్ బయట ముప్పావుగంట చెట్లలో వాకింగ్ చేసాం. పెద్ద టెన్నిస్ కోర్ట్, జనరేటర్ షెడ్, బంగ్లాలు (కాటేజ్‌లు) నాలుగు షాప్‌లు గల షాపింగ్ ఆర్కేడ్ ఉన్నాయి.

**28.10.2015 బుధవారం పదకొండోరోజు.**

ఉదయం నాలుగున్నరకి అలారం మోగగానే నిద్రలేచాం. నేను తయారవుతూంటే పద్మజ పెట్టెలు సర్దింది. 5.30కల్లా గది బయట సామానుంచి జలీ విల్ బఫే రెస్టారెంట్, జిగోలినీ ఇటాలియన్ రెస్టారెంట్, హొరైజన్ అండ్ మొగా బార్ ఉన్నాయి. రెస్టారెంట్లో పండు ఖర్జూరాలు, జామకాయ, ఆరెంజ్, ఏపిల్ జ్యూస్‌లు, కాఫీ, టీలు. నేను తినగలిగినవి కొన్నే ఉన్నాయి. బ్రెడ్‌ని ఫిగ్ జామ్‌తో, గ్రిల్డ్ వెజిటబుల్స్‌ని తిన్నాను. మేష్డ్ పొటాటో (ఉడకపెట్టిన బంగాళాదుంప పేస్ట్)లో పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలని కలుపుకుని తిన్నాను. టీ, కాఫీలని టేబుల్ దగ్గరే సర్వ్ చేసారు. అంతా కొంచెం కొంచెం లైట్ బ్రేక్‌ఫాస్ట్ తీసుకున్నాను. 6.30కి కోచ్ రాగానే లాబీలోని మా సామానుని బస్‌లోని లగేజ్ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కించాను. పోర్టర్‌కి 20 పౌండ్లు టిప్‌గా ఇచ్చాను. 6.45 బస్ లక్సర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కి బయలుదేరింది. ఓ నార్త్ ఇండియన్ లేచి ఓ కాగితం మీద అందరి పేర్లు, ఫోన్ నంబర్లు రాయించాడు.

"ఈ కాగితాన్ని ఫోటో తీసి వాట్సప్‌లో పెడతాను. నేను నైనిటాల్‌కి మూడు గంటల దూరంలో ఉంటాను. మీరెవరైనా వస్తే నైనిటాల్‌కి తీసుకెళ్ళి చూపిస్తాను. వి ఆర్ ఫ్రెండ్స్." ఆహ్వానించాడు.

కానీ తర్వాత అతన్నించి ఆ కాగితం ఫోటో రానేలేదు. రైలు స్నేహాల్లోలా స్నేహం కంటిన్యూ చేయాలని అప్పుడు అనిపించినా టూర్ పూర్తవగానే ఆ తాత్కాలిక స్నేహాన్ని విస్మరించడం అనేక టూర్లలో అనుభవపూర్వకంగా తెలుసు. ఐతే ఆ గ్రూప్‌లోని బరేలీకి చెందిన చందన, బెంగుళూర్‌కి చెందిన ఉమ, పద్మజ ఈ రోజుకీ వాట్సప్ గ్రూప్‌లో స్నేహాన్ని కొనసాగిస్తున్నారు.

మా బస్ పావుగంట ఆలస్యంగా, నలభై ఐదు నిమిషాల తర్వాత లక్సర్ ఎయిర్ పోర్ట్‌కి చేరింది. విమానాశ్రయంలోకి వెళ్ళేముందు బయటే బేగేజ్‌ని స్కేన్ చేస్తున్నారు. ఆశ్చర్యంగా ఆ స్కేన్ చేసే ఉద్యోగి అందర్నీ డబ్బులడుగుతున్నాడు. ఏ దేశంలో చేసే పనికి జీతం ముడుతున్నా ఇంకా ఆశగా డబ్బులు అడగడానికి సిగ్గుపడరో ఆ దేశ ప్రజలు సదా మానసిక వత్తిడిలో ఉంటారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ లేకితనం కనపడదు.

లగేజ్ బుక్ చేసి 7.25కల్లా చెకిన్ చేసాం. లక్సర్ టు కైరో. తర్వాత కైరోనించి కువైట్. ఆ తర్వాత కువైట్ నించి బాంబేకి. చివరగా బాంబే నించి హైదరాబాద్‌కి ప్రయాణం. బోర్డింగ్ పాస్ మీద బేగేజ్ టేగ్‌ని పొరపాటున సిబ్బంది చింపుకునే వైపు అతికించిందా క్లర్క్. అది గమనించిన నేను వాటిని చింపి తీసుకుని పాస్‌పోర్ట్ వెనక అతికించుకున్నాను. బేగేజ్ మిస్సైనప్పుడు ఈ టేగ్స్ లేకపోతే క్లెయిమ్ చేయడం కష్టం.

మా గేట్ నంబర్ 8. ఫ్లైట్ నంబర్ ఎంఓఇ 352. బోర్డింగ్ టైం 7.55 డిపార్చర్ 8.30కి. కానీ బోర్డింగ్ లేటైంది. విమానం పైలెట్ నించి ఎలాంటి ప్రకటనలూ లేకుండా బయలుదేరింది ఇన్‌ఫ్లైట్ మేగజైన్ పేరు హొరస్. నేను అనేకసార్లు విమానం ఎక్కాను. ఒక్క ఈ విమానంలోనే ఈగలు కనిపించాయి. 9.50కి విమానం కైరో ఎయిర్ పోర్ట్‌లో దిగింది. ఎయిర్‌పోర్ట్ షటిల్ ఎక్కి టెర్మినల్‌కి పది నిమిషాల్లో చేరుకున్నాం 10.10కి లగేజ్ కేరసోల్ దగ్గరకి చేరుకున్నాం, ట్రాలీ చక్రాలు దేనికీ సరిగ్గా లేవు. ఓ దానికి వీల్స్ పాడైతే మరో దానికి హేండిల్ బార్ లేదు. ట్రాలీలో టిక్కెట్ కౌంటర్స్ దగ్గరకి వెళ్తే రైల్వే స్టేషన్‌లోలా రణగొణధ్వని. బోర్డ్ పట్టుకుని స్థానిక ట్రావెల్ కంపెనీ మేనేజర్ మమ్మల్ని క్యూలోకి తీసుకెళ్ళాడు. ఎవరూ పెద్దగా క్యూ పాటించడంలేదు. మా వంతు రాగానే కౌంటర్‌లోని వ్యక్తిని నమ్మలేక మా సామానుని బాంబేకే బుక్ చేసుకున్నారని రూఢీ చేసుకుని కానీ కదల్లేదు. బేగేజ్ టేగ్స్ బోర్డింగ్ పాస్‌కి అతికించకపోవడంతో అడిగితే ఆమె వాటిని నిర్లక్ష్యంగా నా ముందు పడేసింది. ఉద్యోగి పబ్లిక్‌తో ప్రవర్తించే తీరు ఆ దేశప్రజల సగటు స్వభావాన్ని తెలియచేస్తుంది. (మన దేశంలోని బేంక్ సిబ్బంది, ముఖ్యంగా స్టేట్ బేంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగస్థుల తీరింతే అని పాఠకులకి తెలుసు)

మా స్థానిక గైడ్ క్యూలో మిగిన వారికి సహాయం చేస్తూ నిలబడ్డాడు. ఎక్కడా ఇమిగ్రేషన్ బోర్డ్ కనపడలేదు. ఓ ఉద్యోగిని ఎటు వెళ్ళాలో అడిగి ఆ కౌంటర్స్‌కి వెళ్ళాం. ఆశ్చర్యంగా ఇమిగ్రేషన్ ఆఫీసర్ కూడా పక్క ఉద్యోగితో ముచ్చట్లు పెట్టుకుని పని నెమ్మదిగా చేస్తున్నాడు. ఇమిగ్రేషన్ అధికారులిలా ప్రవర్తించడం మన దేశంతో సహా ఎక్కడా చూడలేదు.

12.15కి బస్‌లో విమానం దగ్గరకి బయలుదేరి 12.30కి విమానం ఎక్కాం. 3+4+3 సీట్ల వరసలు. మా సీట్ నంబర్లు 54 హెచ్, జి మరొకరికి కూడ్ 54 హెచ్ తప్పుగా ఇవ్వడంతో అతను ఎయిర్ హోస్టెస్‌ని సంప్రదించాడు. అతన్ని బయటికి పంపి సీట్ నంబర్ కరెక్షన్ చేయించుకురమ్మని కోరింది. అది చాలా పాతవిమానం. బయట చల్లగా ఉండటంతో అనుకుంటాను ఏసి ఆన్‌లో లేదు. ఇండికేటర్ లైట్లు కూడా వెలగడం లేదు. విమానం బయలుదేరే ముందు అరబిక్ భాషలో ఐదారు నిమిషాలు ప్రార్ధన వినపడింది. బహుశ అది ఖురాన్ నుంచై ఉండాలి. రెండున్నర గంటల ప్రయాణం. 1.30కి లంచ్ సర్వ్ చేసారు. అన్నం, పన్నీర్ మసాలా కూర, శెనగల కూర, బన్, బటర్, పుడింగ్, వెజ్ సలాడ్, కువైట్‌లోని ఓ స్ప్రింగ్ నించి తీసిన 225 ఎం.ఎల్ నీళ్ళ సీసా, జామకాయ జ్యూస్, కాఫీ, టీ. ఏసి ఆన్ చేయకపోవడంతో లోపల బాగా వేడిగా ఉంది.

నా ప్రక్కన కూర్చున్న అరబ్ నా చొక్కావంక చూపించాడు. పైనించి ఎర్రరంగు ద్రవం నా చొక్కామీదకి చుక్కచుక్కా పడుతోంది. వెంటనే ఎయిర్ హోస్టెస్‌ని పిలిచి చెపితే, పైనున్న సంచిని తీసి, తుడుచుకోడానికి నేప్‌కిన్‌ని ఇచ్చింది.

ఈజిప్ట్ టైం 3.10కి మా విమానం కువైట్ ఎయిర్‌పోర్ట్‌లో దిగింది. కువైట్ విమానాశ్రయంలో బాత్‌రూం వాసన వేస్తోంది. మా రెండో విమానానికి చాలా టైముండటంతో గంట సేపు నిద్రపోయాను. కువైట్‌లో మా స్టాపోవర్ నాలుగు కంటలకంటే ఎక్కువ కాబట్టి స్నాక్ కూపన్స్ ఇచ్చారు. ఐదు గంటలకి కూపన్ తీసుకుని రెస్టొరెంట్‌కి వెళ్తే ఓ కేక్, వెజ్ సేండ్ విచ్, ఛీజ్ సేండ్ విచ్, మూడు చిన్న నల్ల ఆలివ్స్, కాఫీ లేదా పైనాపిల్ జ్యూస్ ఇచ్చారు. కువైట్ టైం రాత్రి 9.30కి సెక్యూరిటీ చెక్‌లో జాయినయ్యాము. సెక్యూరిటీ పోలీస్ ప్రవర్తన రఫ్‌గా ఉంది. కువైట్ టు బాంబేకి కువైట్ ఎయిర్ లైన్స్ విమానం ఇందాకటి దానికన్నా చిన్నది. కొత్తది. 2+4+2 సీట్లు. అన్నీ కలిపి పాతిక లోపే సినిమాలున్నాయి. బాంబేకి ప్రయాణకాలం మూడుగంటల ఇరవై నిమిషాలు. ఫ్లైట్ నంబర్ కెయు 301. సీట్ నంబర్లు 22 ఏ, బి. రాత్రి 10.10కి బయలుదేరింది.

రాత్రి 11.40కి డిన్నర్ సర్వ్ చేసారు. అన్నం, బన్, జామ్, బటర్, పెసరపప్పు, బంగాళాదుంపలు కూర, వెజ్ సలాడ్(అది గడ్డ కట్టి ఉంది) సేమ్యా పాయసం. 125 ఎం.ఎల్ నీళ్ళ సీసా, కాఫీ, టీ, జామకాయ రసం.

బాంబేలోని ఛత్రపతి శివాజీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ టెర్మినల్ -2లో మా విమానం తెల్లవారు ఝామున 4.20కి లేండైంది. నేను సీట్లోంచి దిగి కొద్ది అడుగులు వేసాక నా ట్రావెల్ నోట్ బుక్‌ని సీట్ పౌచ్‌లో పెట్టి తీసుకోవడం మర్చిపోయానని గుర్తొచ్చి వెనక్కెళ్ళి తెచ్చుకున్నాను. లేదా ఈ ట్రావెలాగ్ ఇంత వివరంగా రాయగలిగేవాడిని కాదు. ఇమిగ్రేషన్ క్యూలో అరగంట పట్టింది. కేరసోల్‌లో మా సామాను తీసుకుని కస్టమ్స్ నించి బయటకి వచ్చాక మానిటర్లో హైదరాబాద్‌కి మా ఎయిర్ ఇండియా విమానం డిపార్చర్ గేట్‌ని చూసుకొన్నాం. మా గ్రూప్‌లోని సంజీవరెడ్డి అనే తెలుగాయన మేం డ్యూటీ ఫ్రీలో లిక్కర్ కొనకపోవడంతో మా తరపున మా బోర్డింగ్ కార్డ్‌ని ఉపయోగించి ఆయన కొనుక్కుని మాకిచ్చి, తర్వాత ఇంటికి మనిషిని పంపించి తీసుకుంటానని చెప్పారు. ఆయన ఫోన్ నంబర్ మాకిచ్చి మాది తీసుకున్నారు. (ఆ రోజు సాయంత్రమే ఆయన దాన్ని కలెక్ట్ చేసుకున్నారు) హైదరాబాద్ ఆయన విమానం ఇండిగో, అది డొమెస్టిక్ నించి. డొమెస్టిక్‌కి వెళ్ళే అవసరం ఉండదని మేము ఎయిర్ ఇండియాలో బుక్ చేసుకున్నాం.

ఆయన్నించి శెలవ తీసుకుని మా డిపార్చర్ గేట్‌కి చేరుకున్నాం. దారిలో రెండు చోట్ల చెకింగ్ జరిగింది. కైరో నించి కువైట్ వచ్చిన బోర్డింగ్ పాస్ అడిగారు. అది వెంటనే కనపడకపోవడంతో బేగేజ్ బుక్ చేసిన టేగ్స్ చూసి సంతృప్తి చెందారు. ఎయిర్ ఇండియా కౌంటర్‌లో మా లగేజ్‌ని హైదరాబాద్‌కి బుక్ చేసి బోర్డింగ్ పాస్‌లు తీసుకున్నాం, మా సీట్ నంబర్లు 19ఇ.ఎఫ్. ఇండియా టైం ఉదయం

7.50కి గేట్ నంబర్ 42 ఏలో బోర్డింగ్ ఆరంభమైంది. బాత్‌రూంలో ఫ్రెషప్ అయ్యాక క్యూలో నిలబడ్డాం. 750 కిలోమీటర్ల దూరం. ప్రయాణకాలం గంటా ఇరవైఐదు నిమిషాలు. విమానంలో బ్రేక్‌ఫాస్ట్‌గా బన్, బటర్, కెచప్, టీ, బిస్కెట్లు, మంచినీళ్ళు ఇచ్చారు. విమానం 29.10.2015 ఉదయం 9.50కి హైదరాబాద్‌లో లేండైంది. పదిన్నరకి బయటకి వచ్చి ఎయిర్‌పోర్ట్‌లోని మెక్‌డొనాల్డ్స్‌లో హేష్‌బ్రౌన్, పీజా పఫ్ తిన్నాను. ఇంటికి ఊబర్ బుక్ చేసాం. ఆ డ్రైవర్ పార్కింగ్ ఛార్జ్‌స్‌గా 250రూ అదనంగా అన్యాయంగా తీసుకున్నాడు. ఇచ్చి తర్వాత ఫిర్యాదు చేస్తే ఆ డబ్బుని తర్వాతి ట్రిప్‌కి అడ్జస్ట్ చేస్తామని జవాబు వచ్చింది. 11.35కి ఇంటికి చేరుకోవడంతో మా జోర్డాన్, ఈజిప్ట్ యాత్ర ముగిసింది.

*ఇండియాకి, ఈజిప్ట్‌కి నేను గమనించిన తేడాలు:*

*- నైలు నది నీళ్ళు శుభ్రంగా ఉన్నాయి.*

*- కైరోలో కూడా వీధి బిచ్చగాళ్ళు కనపడలేదు. (అలెగ్జాండ్రియాలో ఒకరిద్దరు, లక్సర్ ఆలయాల బయట ఒకరిద్దరు కనిపించారు.)*

*- వీధి కుక్కలు ఎక్కడా లేవు.*

*- కారు హార్న్ ఎక్కడా వినపడలేదు.*

*- పొలిటికల్ ఫ్లెక్సీలు, బేనర్స్ లేవు. బదులుగా ఇన్‌వెస్ట్ ఇన్ ఈజిప్ట్ ఫర్ బెటర్ ఫ్యూచర్ అనే బోర్డ్‌లు కనిపించాయి.*

*మేం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో విమానం దిగి బయటకి రాగానే, అమరావతికి ఆహ్వానిస్తూ చంద్రబాబు నాయుడి పెద్ద ఫోటో కనిపించింది దీని అద్దె చెల్లించే ఆంధ్రప్రదేశ్ ప్రజలకి దీనివల్ల కలిగే ప్రయోజనం ఏమీలేదు. ఇది మనదేశానికి, ఈజిప్ట్‌కి గల తేడా.*

***(సమాప్తం)***

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in
***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***